# బలి

ఆకాశం ఆవలిస్తోంది.

చంద్రుడు దీర్ఘనిద్రపోయి లేచినట్లున్నాడు.

చుక్కలు ముఖం కూడా చూపించడం లేదు.

గాలికూడా సమ్మె చేసినట్లుంది.

బయట వాతావరణం ఏం బాగా లేదు.

ఊరిచివర అడవి మొదట్లో అందమైన బంగ్లాలో ఉన్న రాజారావు మనస్సు కూడా ఆ రోజు ఏం బాగా లేదు. హాల్లో చేతులు వెనక్కు కట్టుకుని అటూ, ఇటూ పచార్లు చేస్తున్నాడు.

అతడు కోపంతో వేసే ఒక్కొక్క అడుగుకే ఆ భవనం గోడలు దద్దరిల్లిపోతున్నాయి.

రాజారావుది ఆరడుగుల భారీ శరీరం. అప్పుడే చర్మం ఒలిచిన జంతు శరీరంలా వుంటుంది అతని ఒంటిరంగు.

అతని కళ్ళు తాగకపోయినా ఎర్రగానే వుంటాయి?

సాధారణంగా రాజారావుకి కోపం రాదు. ఎప్పుడైనా వచ్చినా అదొక్కనిముషం తాటాకుమంటలా పైకి ఎగసి మళ్ళా అంతవేగంగానూ చల్లారిపోతుంది.

కానీ ఇవ్వాళ పదినిముషాల నుండీ అతడు ఒక్కలా మండిపడుతున్నాడు.

అతనికి కోపం రావడానికి కారణమైన చంద్రవదన. అంటే అతని పర్మనెంటు ప్రియురాలు సోఫాలో కూర్చుని సినిమాపత్రిక తిరగేస్తోంది.

చంద్రవదన తెల్లగా వుంటుంది. ఫోమ్‌బెడ్‌లాటి మెత్తని శరీరం, నవ్వితే సొట్లలుపడే బుగ్గలు, ఎక్వేరియమ్‌లో చేపల్లా తళుక్కుమనే కళ్ళు...... వాటిని చూసే రాజారావు క్రొత్తదనం కోసం అప్పుడప్పుడు ఎవర్నైనా రుచి చూసినా చంద్ర వదన్ని మాత్రం పర్మనెంటుగా వుంచేసుకున్నాడు.

అంత ప్రియాతిప్రియమైన చంద్రవదన ఇవ్వాళ చాలా చిన్నకోరిక కోరింది.

మరేం లేదు.

రాత్రి డిన్నరులోకి మేక మాంసం కావాలని అడిగింది.

" ఓస్ ఇంతేనా, ఏర్పాటు చేస్తాలే."

మాటిచ్చేశాడు రాజారావు.

వెంటనే వంటవాడైన సోమయ్యని పిలిచి చెప్పాడు. కానీ దానికి సోమయ్య చెప్పిన సమాధానం విన్న దగ్గర్నుంచి కోపంతో మండిపడుతున్నాడు.

రాజారావు నెలకోసారి పల్లెటూళ్ళో వూరి చివరనున్న ఆ బంగ్లాకి వస్తుంటాడు. వచ్చే ముందు ఆ బంగ్లా కాపలాదారైన సోమయ్యకి తను వస్తున్నట్లు తెలియచేస్తాడు సోమయ్య అన్నీ అమర్చిపెడతాడు. కానీ ఈ రోజు అటువంటి కబురేమీ లేకుండా రాత్రి ఏడుగంటలకి చంద్రవదనతో పాటు ఆ బంగ్లాకి వచ్చాడు రాజారావు.

హఠాత్తుగా జీపులో దిగిన అయ్యగారిని , చంద్రవదనను చూసి సోమయ్య కంగారుపడ్డాడు.

రాజారావు లేనప్పుడు ఆ బంగ్లా సంరక్షకుడు సోమయ్యే అతడికి సహాయంగా ఇంకో వాచ్‌మెన్ వున్నాడు. సోమయ్యకి యాభై ఏళ్ళుంటాయి. కానీ అరవైయ్యేళ్ళ వ్యక్తిలా ఉంటాడు. తలపండిపోయింది. చాకు పట్టుకుంటే చెయ్యి వణుకుతుంది. అతని చేతిలోని చాకు కాయగూరల పీకల్ని మాత్రమే కోస్తుంటుంది. కంఠాలు తెగిన ఆ కూరగాయలతో అతడు బ్రహ్మాండంగా వంట చేస్తాడు. అందుకే రాజారావు వయసు మళ్ళుతోన్నా సోమయ్యని పనిలోనుండి తీసెయ్యలేదు.

సోమయ్యకి పదేళ్ళ వయసప్పుడు రాజారావుని ఎత్తుకుని ఆడించేందుకు ఆ ఇంట్లో అడుగుపెట్టాడు. అప్పటికి రాజారావు వయస్సు ఏడాది.

చిన్నప్పుడు రాజారావు ఇచ్చే చాక్లెట్లతో పాటు అతని తిట్లనీభరించడం అలవాటయింది సోమయ్యకి.

వయసొచ్చాక సోమయ్య యొక్క మంచితనం గ్రహించిన రాజారావు అతన్ని కొద్దిగా గౌరవంగానే చూసేవాడు.

సోమయ్యని కోపగించుకునే అవసరం ఎప్పుడూ రాలేదు. కానీ ఈ రోజు చిరాకుపడుతున్నాడు. కోపంతో ఎగిరెగిరి పడ్తున్నాడు.

"ఏమిటింకా అలా స్తంభంలా నిలబడ్డావ్. వెళ్ళి ఏర్పాట్లు చూడు" విసుక్కున్నాడు.

రాజారావు మాటలు సోమయ్యకి, ప్రక్కనే వున్న అడవిలోనుండి విన్పించే పులి గాండ్రింపులా వున్నాయి.

"అదికాదు బాబూ! వాచ్‌మెన్ ఈ రోజు పనిలోకి రాలేదు. ప్రక్కనున్న పల్లెలో ఇంత రాత్రప్పుడు ఏ మాంసమూ దొరకదు. పట్నం ఇప్పుడెవరెల్తారు బాబూ?" సోమయ్య వినయంగా చెప్పాడు.

సోమయ్య సమాధానం అగ్గిమీద ఆజ్యం పోసినట్లయింది రాజారావుకి.

"సోమయ్యా!" గర్జించాడు రాజారావు.

"నాముందునుంచి వెళ్ళు. ఇంకో గంటలో భోజనానికి వస్తాం. మేక మాంసం రెడీగా వుండాలి" ఆజ్ఞాపించాడు.

సోమయ్య ఇంకేం మాట్లాడలేక నీరసంగా అడుగులు వేసుకుంటూ లోపలికెళ్ళాడు.

పొయ్యి అంటించి ఎసరు పడేశాడు. పొయ్యి భగభగా మండుతోంది.

సోమయ్య మనస్సు కూడా మండిపోతోంది. మొదటిసారిగా రాజారావు మీద విపరీతమైన కోపం వచ్చింది.

రాజారావు మాటకు ఎవ్వరైనా ఎదురు చెప్పినా, అతడు చెప్పిన పని చెయ్యకపోయినా అతడికి ఎంతో కోపం వస్తుంది. గతంలో అతని కోపానికి చాలామందే ఆహుతయ్యారు.

“ ఈరోజు తనవంతా ?” బాధగా అనుకున్నాడు సోమయ్య.

ఇంత రాత్రయింది. ఇప్పుడికిప్పుడు మాంసం ఎక్కడ దొరుకుతుంది! మాంసంతో భోజనం పెట్టకపోతే రాజారావుకి కోపం రావడం తథ్యం.

కోపం వస్తే తనకు వుద్వాసన తప్పదు.

అప్పుడు......

తనూ, తన రోగిష్టి పెళ్ళాం ఎక్కడి కెళ్ళాలి!

తనకున్న ఒక్కగానొక్క కొడుకు పట్నంలో కూలీపని చేస్తున్నాడు. వాడి సంపాదన వాడికే సరిపోదు. ఇంకా తనే కొడుక్కి అప్పుడప్పుడు డబ్బు పంపుతుంటాడు.

అక్కడ తన మనవరాలికి సరైన పోషణ లేక ఎండిపోతోందని ఇక్కడకు తీసుకొచ్చాడు.

తనకిప్పుడీ పనిపోతే......

తను వీధుల్లో అడుక్కోవాలిసిందే.....

తలుచుకుంటుంటేనే సోమయ్యకి భయంతో ఒళ్ళు జలదరించింది.

కానీ ఇప్పుడీ సమయంలో మాంసం ఎక్కడనుండి తేవాలి ?

సోమయ్యకి పిచ్చెక్కిపోతోంది.

“సోమయ్యా ! రెండు కప్పులు కాఫీపట్రా” రాజారావు హాల్లోంచి కేకపెట్టాడు.

సోమయ్య లేచాడు. కాఫీ కలిపి రెండు కప్పుల్లో పోసి హాల్లోకి తీసుకెళ్ళాడు.

కప్పులు అక్కడ టేబిల్ మీద పెట్టి ఇవతలికి రాబోయాడు. ఇంతలో....

“తాతా” అన్న పిలుపు విన్పించింది.

లోపలి కెళ్ళబోతున్న సోమయ్యా, పత్రిక తిరగేస్తున్న చంద్రవదన. రేపటి వేటకోసం తుపాకీ సరిచూసుకుంటున్న రాజారావు వులిక్కిపడ్డారు. తలెత్తి చూశారు.

ఛెంగు ఛెంగున మేకపిల్లలా గెంతుతూ లోపలికొస్తున్న పన్నెండేళ్ళ పిల్ల కన్పించింది.

మనవరాలివేపు ఆప్యాయంగా చూశాడు సోమయ్య. విచ్చినకలువలా వున్న ఆ పిల్ల ముఖం వేపు చూస్తోంది చంద్రవదన.

రాజారావు ఆ పిల్ల చేతిలో తెల్లగా, అందంగా వున్న మేకపిల్లవేపు చూశాడు.

“తాతా, అమ్మమ్మ పిలుస్తోంది. అన్నం తిందాంరా.” అంటోంది.

“సోమయ్యా! ఈ పిల్ల నీ మనవరాలా ?” రాజారావు అడిగాడు.

"అవును బాబూ. నా కొడుకు కూతురు ? పేరు గౌరి"

"ఉహు,'' అంటూ మళ్ళీ ఆ మేకపిల్ల వేపు చూశాడు రాజారావు.

"సోమయ్యా ! ఆ మేకపిల్ల ఎవరిది."

గతుక్కుమన్నాడు సోమయ్య. "దాన్ని నా మనవరాలు పెంచుకుంటోందండీ. అదంటే దీనికి పంచప్రాణాలు." అన్నాడు భయం భయంగా.

"సోమయ్యా ఆ మేకపిల్లని తీసికెళ్ళి వండు." అన్నాడు చంద్రవదన కోరిక తీరుతోందనే సంతోషం వుందతని గొంతులో.

ఆ మాట విని తెల్లబోయాడు సోమయ్య.

తన మనవరాలి చేతిలో వున్న మేకపిల్ల వేపు చూశాడు. తెల్లగా రాజారావు పెంచే బొచ్చుకుక్కలా ముద్దొస్తోంది. అలాటి మేకపిల్లని చంపమనడానికి అయ్యగారికి మనసెలా ఒప్పిందో అనుకున్నాడు.

అంతేకాదు. ఆ మేకపిల్ల లేకపోతే గౌరి క్షణం వుండలేదు. ఒకరోజు అడవిలో తప్పిపోతే అది దొరికే వరకూ అన్నం నీళ్ళూ మానేసింది.

"సోమయ్యా. ఏమిటింకా ఆలస్యం. వెళ్ళు. ఆ మేకపిల్లని తీసుకెళ్ళి వండు"

ఆ మేక మాంసం రుచిని తలుచుకుంటూ అన్నాడు రాజారావు.

గౌరి బిత్తరపోయింది.

రాజారావు మాటలు సరిగ్గా అర్థం కాకపోయినా తన చిన్నారి నేస్తానికి ఏదో ప్రమాదం జరగబోతోందని గ్రహించింది. వెంటనే వెనుదిరిగి బయటికి పరిగెత్తబోయింది.

"ఏయ్ గౌరీ, ఆగు. ఆ మేకనిటివ్వు." రాజారావు వెనుక అరుస్తున్నాడు.

గౌరి విన్పించుకోకుండా హాలు దాటింది.

రాజారావు ఆ నిర్లక్ష్యాన్ని భరించలేక పోయాడు. కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి. మళ్ళీ పిలిచాడు.

కాని గౌరి ఆగలేదు.

వరండా కూడా దాటి మెట్టుమీదికి అడుగేసింది.

రాజారావు రెచ్చిపోయాడు.

చేతిలో వున్న తుపాకీని ఆ పిల్లవేపు గురిపెట్టి పేల్చాడు.

గౌరి "అమ్మా" అంటూ మెట్లమీది నుండి దొర్లిపోయింది.

గౌరి చేతిలోని మేకపిల్ల ఎగిరి అవతల పడింది.

చంద్రవదన కెవ్వుమంది.

సోమయ్య స్తంభించిపోయాడు. జరిగిందేమిటో క్షణకాలం అతడికి అర్థం కాలేదు.

"సోమయ్యా. వెళ్ళి ఆ మేకపిల్లని తీసుకురా." రాజారావు మాటల్తో అతనికి స్పృహ వచ్చింది. గబగబా వరండాలోకి వెళ్ళిచూశాడు.

గౌరి రక్తపు మడుగులో గిలగిలా తన్నుకుంటోంది. "తాతా నువ్వు గొప్పగా పొగుడ్తూ చెప్పే మీ అయ్యగారు ఎంత పనిచేశాడో చూశావా! మేక మాంసం కోసం నన్నే

బలి ఇచ్చాడు. తాతా, నా మాంసాన్ని వండి మీ అయ్యగార్కి పెట్టు." అని గౌరి అంటున్నట్లుగా అన్పించింది సోమయ్యకి.

మేకపిల్ల గౌరి వేపు చూసి దీనంగా అరుస్తోంది. సోమయ్య వెళ్ళి ఆ మేకపిల్లని చేతిలోకి తీసుకుని వరండా మెట్లెక్కాడు.

"సోమయ్యా. త్వరగా వండు. ఆకలి మండిపోతోంది." రాజారావు అంటున్నాడు.

సోమయ్య ముఖంలోకి వెచ్చని ఆవిరొచ్చింది. చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతున్నాడు.

తన ప్రాణానికి ప్రాణమైన గౌరి.

ప్రతిక్షణం "తాతా..." అంటూ తనని వదలకుండా తిరిగే గౌరి ఇప్పుడు రక్తపుమడుగులో

బాధ - ఆవేదనతో సోమయ్య శరీరం భగ్గుమంది.

ఒళ్ళు మరిచిపోయాడు.

మేకపిల్లని క్రిందికి వదిలి, గబుక్కున టేబిల్ మీద నున్న పళ్ళు కోసే కత్తి చేతిలోకి తీసుకుని-

"ఏరా! నీకు మేక మాంసం కావాలా ? ఇస్తారా. మాంసం కమ్మగా వండిపెడతా. తింటావా?" అంటూ రెప్పపాటులో రాజారావు మీదికి దాడిచేసి, అతని గుండెల్లో గట్టిగా పొడిచాడు.

రాజారావు రక్తపుమడుగులో గిలగిలా తన్నుకుంటున్నాడు.

సోమయ్య పగలబడి నవ్వుతున్నాడు.

చంద్రవదన భయంతో వణికిపోతోంది.

"సోమయ్యా. ఏమిటలా కొయ్యలా నిలబడ్డావ్. లోపలికి ఫో"

రాజారావు కంఠం ఖంగుమంది.

సోమయ్య వులిక్కిపడి చూశాడు.

చాకు టేబిల్ మీదే వుంది.

రాజారావు తుపాకీ బాగుచేసుకుంటున్నాడు.

చంద్రవదన సినిమా పత్రిక తిరగేస్తూనేవుంది.

బయట రక్తపు మడుగులో కొట్టుకుంటున్న గౌరిలో ప్రాణాలు ఎగిరిపోయాయి. చలనం ఆగింది.

ప్రాణంలేని కట్టెలా నిలబడ్డ సోమయ్యలో చలనం కలిగింది.

నెమ్మదిగా వంటయింటివేపు అడుగేశాడు. సోమయ్యకి జీవితంలో మొదటిసారిగా తన మీద, తన చేతకానితనం మీద. తనని చేతకానివాడుగా పుట్టించిన ఆ దేవుడిమీద విపరీతమైన అసహ్యం కలిగింది.

అలా అసహ్యించుకుంటూ లోపలికి వెడుతున్నాడు. అతని చేతిలోని మేకపిల్ల మాత్రం "గౌరీ, గౌరీ" అంటూ దీనంగా అరుస్తోంది.